# ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు

## కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, అక్టోబర్ 13 : అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ప్రతి ఒక్కరూ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ తప్పక అమలు చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన కో ఆర్డినేషన్ మీటింగ్‌లో ఎస్పీ కోటిరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ర్యాలీలు, బహిరంగ సభలకు కచ్చితంగా అనుమతులు (http://suvidha.eci.gov.in/login) యాప్‌ను ఉపయోగించి తీసుకోవాలన్నారు. ఎన్నికల సంబంధిత ఏదైనా ఫిర్యాదు కొరకు సి-విజిల్ యాప్‌ను ఉపయోగించాలని, ఈయాప్‌లలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిశీలించాలన్నారు సీ విజిల్ యాప్‌పై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. పోస్టర్లు, బ్యానర్లకు సంబంధించిన విషయంలో ఎంసీసీ నియమాలు కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. అక్రమంగా డబ్బులు, మద్యం పంచడం పైన ప్రత్యేక నిఘా పెట్టాలని, సమస్యాత్మక గ్రామాల్లో ముందస్తు నిఘా ఏర్పాటు చేసి ఏదైనా సమస్యలు ఉంటే ముందుగానే తెలుసుకోవాలని సూచించారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని తెలిపారు. చెక్ పోస్టుల వద్ద సీసీ టీవీలు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ అధికారులు తమ తమ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలపైనా నిఘా పెట్టాలని, ఎన్నికలకు ఎక్కడ ఎలాంటి అవాంతరాలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏయే పోలీస్ స్టేషన్‌లలో ఎన్ని పోలింగ్ కేంద్రాలు ఉన్నాయో వివరాలు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీటీసీ అదనపు ఎస్పీ మురళీధర్, డీఎస్పీలు నర్సింహులు, శేఖర్‌గౌడ్, కరుణాసాగర్‌రెడ్డి, డీటీసీ డీఎస్పీ విజయ్‌కుమార్, డీఎస్పీ జానయ్య, జిల్లాలోని ఇన్‌చార్జీలు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

### మీడియా సెంటర్ ప్రారంభం

శాసనసభ ఎన్నికల సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ) సెల్‌ను జిల్లా ఎన్నికల అధికారి నారాయణరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడి యా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించనున్నట్లు తెలిపారు. ఎంసీఎంసీ కమిటీ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తిస్తామన్నారు. ఈ కమిటీ ద్వారా ప్రకటనలు, ప్రచురణ ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలను ప్రసారం చేయడం లాంటి ప్రక్రియను పరిశీలిస్తుందన్నారు. సంబంధిత అభ్యర్థి ప్రచార వ్యయంలో వాటిని లెక్కించడం జరుగుతుందని తెలిపారు. సోషల్ మీడియాలో అభ్యర్థులు రాజకీయ పార్టీల ప్రకటనలను కూడా పరిశీలించడం జరుగుతుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అన్ని రకాల ప్రకటనలకు ఎంసీఎంసీ ద్వారా సకాలంలో ఆమోదం మంజూరు చేయాలని సంబంధిత అధికారులను సూచించారు. సోషల్ మీడియాతో వచ్చే పోస్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమించిన పోస్టులపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్, 1950 కాల్ సెంటర్, సి-విజిల్ సెంటర్‌లను పరిశీలించి, విధులు నిర్వహించే సిబ్బందికి పలు సలహాలు, సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి రాహుల్‌శర్మ, డీఆర్‌డీవో కృష్ణన్, డీవైఎవో హనుమంతరావు, ఎన్నికల నోడల్ అధికారి ఉపేందర్, శ్రీనివాస్‌రావు, సుధారాణి, ఆరిపుద్దీన్, ఎన్నికల సిబ్బంది, సోషల్ మీడియా సిబ్బంది మీర్జా పాల్గొన్నారు.

# 15 నుంచి 23 వరకు బ్రహ్మోత్సవాలు



ముస్తాబైన వేంకటేశ్వరస్వామి ఆలయం ,దేవతామూర్తులు (ఇన్‌సెట్లో)

వికారాబాద్, అక్టోబర్ 13: పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో ఉన్న శ్రీ వేంకటేశ్వరాలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 15 న ప్రారంభం కానున్నట్లు ఆలయ ధర్మకర్తలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15న ఆదివారం స్వామి వారు శేష వాహనంపై ఊరేగుతారు. 16న చంద్రప్రభ వాహనం, 17న హంస వాహనం, 18న హనుమద్వాహనం, 19న సింహా వాహనం, 20న తెప్పోత్సవవ, 21న రథోత్సవం, 22న సూర్యప్రభ, గరుఢ వాహనము, 23న శమీ పూజ, చక్రస్నానం, ధ్వజారోహణ కార్యక్రమాలు జరుగుతాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ ధర్మకర్తలు కోరారు.

### శని అమావాస్య సందర్భంగా..

# ఎన్కతల ఆలయంలో విస్తృత ఏర్పాట్లు



మోమిన్‌పేట, అక్టోబర్ 13 : మండల పరిధిలోని ఎన్కతల గ్రామంలో వెలి సిన శ్రీశనైశ్చర స్వామి ఆలయంలో శని అమావాస్య సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు జరగనున్నాయి. మోమిన్‌పేట మండల కేంద్రం నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలో శంకర్‌పల్లి హైదారాబాద్ వెళ్లే మార్గంలో ఎన్కతల గ్రామంలో ఆలయం ఉంది.శంకర్‌పల్లి నుంచి మోమిన్‌పేట వెళ్లే మార్గంలో 20 కిలో మీటర్ల దూరంలో ఈ గ్రామం వస్తుంది.శనేశ్చర స్వామి దర్శించడానికి బస్సు సౌకర్యం ఉంది. ప్రత్యేక రోజుల్లో ఎన్కత లకు సంగారెడ్డి, వికారాబాద్ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు సడుపుతారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, వాహనాల పార్కింగ్ అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మహిపాల్ రెడ్డి, ఈవో నరేందర్ తెలిపారు.

# ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్న కాంగ్రెస్



డిప్యూటీ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బొంరాస్‌పేట, అక్టోబర్ 13: బొంరాస్‌పేట మండలంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్నారని బీఆర్ఎస్ నాయ కులు ఆరోపించారు. ఈ మేరకు చర్యలు తీసుకో వాలని పార్టీ మండలాధ్యక్షుడు కోట్ల యాదగిరి ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం డిప్యూటీ తహసీ ల్దార్ రవికి ఫిర్యాదు చేశారు. ఎన్నికల ప్రవ ర్తనా నియమావళి అమలులోకి వచ్చిన తరువాత మం డలంలోని వివిధ గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఇంటి యజమానుల అనుమతి లేకుండా ఇళ్ల గోడ లకు, డబ్బాలకు, ఆటోలకు వాల్ పోస్టర్లను అతికించారని ఆరోపించారు. అధికారులు స్పందించి వీటిని వెంటనే తొలగించాలని, మండల కాంగ్రెస్ అధ్యక్షుడి ఇంటి వద్ద కూడా పెద్ద ఫ్లెక్సీని ఏర్పాటు చేశారని దీనిని కూడా తొలగించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రావణ్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీలు నారాయణరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఖాజా మైనుద్దీన్, పార్టీ నాయకులు దేశ్యా నాయక్, రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల అంశాలపై పూర్తి అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి రాహుల్‌శర్మ

వికారాబాద్, అక్టోబర్ 13 : నియోజకవర్గంలో ఎన్నికల విధుల నిర్వ హణకు నియమించిన అధికారులు వారికి సంబంధించిన అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని వికారాబాద్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి రాహుల్‌శర్మ సూచించారు. శుక్రవారం ఆయన కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో నియోజకవర్గ ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళికి అనుగుణంగా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రతి రోజు ఎప్పటికప్పుడు నివేదికలను పంపించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చూసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో నియోజకవర్గ నోడల్ అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

### కానిస్టేబుల్ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు..

# 266 మంది అభ్యర్థులు హాజరు

వికారాబాద్, అక్టోబర్ 13 : ప్రజలకు చేరువై సేవలు చేయడంతో పాటు, పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలని జిల్లా ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో ఇటీవల పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరైన వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 277 మంది పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకుగా 266 మంది అభ్యర్థులు సర్టిఫికేట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యా రన్నారు. పోలీస్ కానిస్టేబుల్ కొరకు ఎంపికైన అభ్యర్థులకు 16 నుంచి 17 వరకు పోలీస్ కార్యాలయంలో మెడికల్ టెస్ట్ ఉంటుందన్నారు. ఈ టెస్ట్‌కు అందరూ హాజరు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీటీసీ అదనపు ఎస్పీ మురళీధర్, ఏవో జ్యోతిర్మణి, ఏఆర్ డీఎస్పీ వీరేశం, ఆర్ఐ అచ్యుతరావు, ఆర్ఎస్ఐలు ఉన్నారు.

# మొక్కలను జాగ్రత్తగా కాపాడుకోవాలి



నర్సరీలోని మొక్కలను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ నారాయణ్ అమిత్, తదితరులు

ధారూరు, అక్టోబర్ 13: నర్సరీలలోని మొక్కలను జాగ్రత్తగా కాపాడుకోవాలని, వచ్చే వర్షాకాలం నాటికి అవసరమైన మొక్కలు సరఫరా చేయడానికి బ్యాగులను తయారు చేసుకోవాలని జిల్లా ట్రైనీ కలెక్టర్ ధారూరు ఇన్‌చార్జి ఎంపీడీవో నారాయణ్ అమిత్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ధారూరుస్టేషన్ గ్రామంలో జరుగుతున్న అండర్ డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామ నర్సరీని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నర్సరీలోని మొక్కలను పరిశీలించారు. ఆయన వెంట ధారూరు ఏపీవో సురేష్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ అనంద్, ఈసీ రమేశ్, గ్రామ సర్పంచ్ , పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

# లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ



ధారూరు, అక్టోబర్13; గొర్రెల పెంపకం దారులు వాటిని జాగ్రత్తగా పెంచి లబ్ధిపొందాలని పశువు వైద్యాధికారి డాక్టర్ శ్రీకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కుక్కింద గ్రామంలో 11మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 21 చొప్పున గొర్రెలను పంపిణీ చేశారు. కుక్కింద గ్రామానికి చెందిన బి. బాలప్ప, జె.రాంచంద్రయ్య, జె.బీరమ్మ, కె.అంతయ్య, కె.రాములు, కె. బుగ్గయ్య, కుర్వయాదయ్య, జె.లక్ష్మయ్య, జె.చిన్న రామయ్య, జె.రవిందర్, బి.నర్సింహులుకు మంజూరైన గొర్రెలను వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారులు డాక్టర్ స్వర్ణలత, శంకర్రావు, సిబ్బంది రాములు, చంద్రశేఖర్, నాయకులు అధికారులు పాల్గొన్నారు.

# అనాథ చిన్నారులకు చేయూత..



కొడంగల్, అక్టోబర్ 13: మండలంలోని టేకల్‌కోడ్ గ్రామానికి చెందిన కుటుంబంలో తల్లిదండ్రులను కోల్పోయి చిన్నారులు అనాథలుగా మిగిలారని, వారికి ప్రతి సంవత్సరం పండుగల సందర్భంగా నూతన దుస్తులతో పాటు నిత్యావసర సరుకులను అందిస్తున్నట్లు తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి కే. రవీందర్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం స్థానిక సిద్ధార్థ పాఠశాల ప్రాంగణంలో టీవీవీ, కిసాన్ బంధు ఆధ్వర్యంలో చిన్నారులకు దసరా కానుక అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో డా.రవీంద్రయాదవ్, ఎంఈవో రాంరెడ్డి, టీవీవీ జిల్లా కార్యదర్శి బాకారం చంద్రశేఖర్, జిల్లా నాయకులు గౌరారం గోపాల్, తపస్ సంఘం నాయకులు క్రాంతికుమార్, హరివిల్లు ఫౌండర్ మురహరి పాల్గొన్నారు.